## క్లుప్తంగా

### 5న హుండీల ఆదాయం లెక్కింపు

**సఖినేటిపల్లి:** ఈ నెల ఐదో తేదీన అంతర్వేది ఆలయంలో స్వామివారి హుండీల లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

### దేవస్థానానికి కూలింగ్ బాక్స్ సమర్పణ



కూలింగ్ బాక్స్ సమర్పిస్తున్న బీఓబీ ఉద్యోగులు

**మామిడికుదురు:** అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయానికి బ్యాంక్ ఆఫ్ బరోడా అప్పనపల్లి బ్రాంచ్ ద్వారా మంగళవారం రిఫ్రిజిరేటర్ (కూలింగ్ బాక్స్)ను అందించారు. రూ.25 వేలు విలువైన కూలింగ్ బాక్స్‌ను బ్యాంక్ మేనేజర్ జి.సందీప్ నిత్యాన్నదానానికి అందజేశారు. దీన్ని ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ద్వారా ఆలయానికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, ఉప ప్రధానార్చకుడు మద్దాలి తిరుమలశింగరాచార్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### బాధితులకు ఆర్థిక సాయం

**ఆలమూరు:** మండలంలోని పెదపళ్లలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన గ్రామ వలంటీర్ తాతపూడి చినరాజు కుటుంబానికి పలువురు దాతలు మంగళవారం ఆర్థికసాయం అందించారు. మురళీకృష్ణల సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు, గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు రూ.ఐదు వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. దాతల సాయాన్ని పలువురు గ్రామస్తులు కొనియాడారు.

### సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలి

**అంబాజీపేట:** రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. మొసలపల్లిలో సచివాలయాన్ని మంగళవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజు సచివాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించే స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేజర్ సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించాలన్నారు. అనంతరం పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ మెనూను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగాబత్తుల సత్యనారాయణ, దంతులూరి శ్రీనురాజు, కట్టా రామచంద్రరావు, నాగాబత్తుల శ్రీనివాసరావు, కట్టా గోపాలకృష్ణగోఖలే, దంతులూరి కృష్ణమూర్తి, కట్టా దుర్గాదేవి పాల్గొన్నారు.

### అంతర్వేదిలో డీఎల్పీవో పర్యటన

**సఖినేటిపల్లి:** అంతర్వేదిలో రానున్న తీర్థం ఏర్పాట్ల గురించి పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ముందస్తు పనుల పరిశీలనకు డీఎల్పీవో మల్లికార్జునరావు మంగళవారం పర్యటించారు. ఇటీవల దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఆయన క్షేత్ర స్థాయిలో పనులు గురించి ఎంపీడీవో జి.భీమారావుతో కలసి సమీక్షించారు. పంచాయతీ పరంగా శానిటేషన్ పాయింట్లు, తీర్థంలోని వివిధ వీధుల్లో పరిశుభ్రత, జంగిల్ క్లియరెన్స్, పార్కింగ్ స్థలాలు గుర్తింపు వంటి వాటి గురించి ఆయనతో డీఎల్పీవో చర్చించారు. పార్కింగ్‌కు ఎంపిక చేసిన స్థలాల్లో వాహనాలకు ఇన్, ఎగ్జిట్ గేట్లను ఏర్పాటు దిశగా చూడాలని కార్యదర్శి పి.రాంబాబుకు డీఎల్పీవో సూచించారు. వీటితో పాటు అంతర్వేది మంచినీటి చెరువు చుట్టూ శానిటేషన్, చెరువు కలుషితం కాకుండా, పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన సూచనలు కూడా ఆయన పంచాయతీ కార్యదర్శికి చేశారు. వెంట ఈవోపీఆర్డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

### నేడు పలు అభివృద్ధి పనుల ప్రారంభం

**మామిడికుదురు:** రాజోలు నియోజకవర్గ పరిధిలోని మగటపల్లిలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, పార్టీ ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సూరిశెట్టి బాబి మంగళవారం తెలిపారు.

### 28 కేజీల గంజాయి స్వాధీనం

**అయినవిల్లి:** మండలంలోని అయినవిల్లిలంక దుర్గమ్మ ఆలయం వద్ద నలుగురు వ్యక్తులు మంగళవారం గంజాయి అమ్ముతుండగా వారి నుంచి 28 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం అయినవిల్లిలంక వద్ద గోసంగి అఖిల్ అతడితో పాటు మరో ముగ్గురు గంజాయి అమ్ముతుండగా స్థానికులు సమాచారం మేరకు అయినవిల్లి ఎస్సై, అయినవిల్లి తహసీల్దార్ రియాజ్ కలసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 28 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# సావిత్రీబాయి జీవితం మహిళలకు ఆదర్శం



మలికిపురం పూలే-అంబేద్కర్ భవనంలో సత్కారం అందుకున్న మహిళా ఉపాధ్యాయినులతో ప్రముఖులు

**మామిడికుదురు:** దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలేను నేటి తరం ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని బీసీ, ఎస్సీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, భూపతి మనోహర్ సూచించారు. స్థానిక బాలుర వసతి గృహం వద్ద ఉన్న సావిత్రీబాయి విగ్రహానికి మంగళవారం బీసీ, ఎస్సీ ఉద్యోగుల సంఘం నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె విద్యారంగానికి చేసిన సేవలను ప్రస్తుతించారు. ఎన్నో ఇబ్బందులను ఆమె ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగారన్నారు. కార్యక్రమంలో ఆయా యూనియన్ల ప్రతినిధులు పోలవరపు సత్యసాయిబాబు, కారుపల్లి కల్యాణ్‌బాబు, బయ్యామోహనరావు, పెయ్యల వీరభద్రరావు, బొక్కా వెంకటేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, పూలే సామాజిక వేదిక మండల శాఖ కన్వీనర్ వాసంశెట్టి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

**రావులపాలెం:** మండలంలోని కొమరాజులంక ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సర్పంచ్ కర్రి గోవిందకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే అని ఆమె గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పోతురాజు, ఉపాధ్యాయులు రామచంద్రరావు, కరుణశ్రీ, వైవీఎస్ఎన్ బాలాజీ, వాణి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**అంబాజీపేట:** తొలి మహిళా ఉపాధ్యాయినిగా విధులు నిర్వహించిన సావిత్రీబాయి సేవలు మరువలేనివని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. అంబాజీపేట మండల పరిషత్, ఎంఈఓ కార్యాలయాల వద్ద సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైలా ఆనందరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, మట్టపర్తి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. తొండవరం, అంబాజీపేట జెడ్పీ హైస్కూళ్లలో హెచ్ఎంలు మోకా ప్రకాష్, బీర హనుమంతరావుల ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతి నిర్వహించారు.



మామిడికుదురులో సావిత్రీబాయి పూలే విగ్రహానికి ఉద్యోగ సంఘాల నేతల నివాళి



రావులపాలెంలో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

**కొత్తపేట:** ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయిని, సామాజిక విప్లవ ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే జీవితం మహిళాజాతికి ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులకు ఆదర్శమని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ అన్నారు. కళాశాలలో విమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ టి.రమాదేవి ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. వెదిరేశ్వరం ఎంపీపీ పాఠశాల నుంచి సావిత్రీబాయి అవార్డు గ్రహీత పి.నిర్మలకుమారి, స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని కె.శ్రీలక్ష్మి ముఖ్యవక్తలుగా పాల్గొన్నారు.

**మలికిపురం:** స్థానిక పూలే-అంబేడ్కర్ భవనంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి బహుజన సమన్వయ సమాఖ్య ప్రతినిధులు బత్తుల లక్ష్మణరావు, గెడ్డం తులసీభాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి నియోజకవర్గంలోని 14 మంది మహిళా ఉపాధ్యాయినులను సత్కరించారు. సమాఖ్య తరఫున సావిత్రీబాయి పూలే అవార్డులను ప్రదానం చేశారు. ఎంపీటీసీలు కె.సీతామహాలక్ష్మి, జె.శ్రీదేవి, వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు జాన శంకరరావు, ఎంఈవోలు నల్లి మనోహరం, విజయశ్రీ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గెడ్డం ఫిలిప్‌రాజు, కార్యదర్శి ఎస్.మురళి, నాయకులు పాల్గొన్నారు. విశ్వేశ్వరాయపురం వివేకానంద స్కూల్‌లో మహిళా టీచర్లను సత్కరించారు.

**రాజోలు:** సావిత్రీబాయి పూలే ఆదర్శనీయురాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. కళాశాల ఆవరణలో సావిత్రీబాయి జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా విద్యకు ఆమె పునాది వేశారన్నారు. విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ పి.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

**ఆత్రేయపురం:** సావిత్రీబాయి పూలే జయంతిని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీడీవో నాతి బుజ్జి, సిబ్బంది సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఏవో సురేంద్రరెడ్డి, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



అంబాజీపేటలో సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



కొత్తపేటలో ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్



రాజోలులో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

### 6న ఉచిత వైద్య శిబిరం

**ఆలమూరు:** మండలంలోని చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల ఆరో తేదీ శుక్రవారం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం ఏర్పాటు జరుగుతుందని కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రికి చెందిన సుమారు 15 మంది వైద్యుల బృందం నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైన రోగులకు శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తారన్నారు.

### సెల్‌ఫోన్ చోరీపై కేసు

**మామిడికుదురు:** పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్‌లో ఎంఎస్ గార్డెన్ రెస్టారెంట్‌లో సెల్‌ఫోన్ చోరీకి గురైందని రెస్టారెంట్ అధినేత గెడ్డం నర్సింహమూర్తి చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా మంగళవారం తెలిపారు. ఫ్రైడ్‌రైస్ కోసం వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి టేబుల్‌పై ఉంచిన సెల్‌ఫోన్‌ను తీసుకు వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. ఈ ఫోన్ విలువ రూ.21,990 ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### కాపులకు రిజర్వేషన్లు కల్పించాలి

**సఖినేటిపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బీజేపీ కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. మంగళవారం ఆయన టేకిశెట్టిపాలెంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. అయితే దీనిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. కాపులు పేరుతో మంత్రి పదవులు పొందిన వారు రిజర్వేషన్లు గురించి మాట్లాడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## బాలాజీ కోవెలకు పూర్వవైభవం తీసుకువస్తాం



అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

**మామిడికుదురు:** అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా కార్యాచరణ చేపట్టామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఆయన మంగళవారం అప్పనపల్లి స్వామిని దర్శించుకున్నారు. అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయంలో నిత్యం నిర్వహిస్తున్న పూజలతో పాటు ఆలయాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్ నుంచి ఆలయం వరకు పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 25 అడుగుల వెడల్పుతో పక్కా సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. బాలబాలాజీ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఆర్అండ్‌బీ రోడ్డు ఆధునీకరణ చర్యలు చేపట్టామన్నారు. ఏటా గోదావరి వరదల సమయంలో ముంపుబారిన పడుతున్న కాజ్‌వే ఎత్తు పెంచి ముంపు సమస్యకు విముక్తి కలిగిస్తున్నామన్నారు. దీంతో పాటు తీర గ్రామాలకు సాగునీరందించే అప్పనపల్లి ఎత్తిపోతల పథకానికి కూడా త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ గెడ్డం కృష్ణమూర్తి, మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, పార్టీ నేతలు బత్తుల జనార్దనరావు, గెడ్డం వెంకటేశ్వరరావు, నీతిపూడి మహేష్, లంకే ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం.. జగనన్నకే సాధ్యం

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- జిల్లెళ్లపేటలో గడపగడపకూ..



జిల్లెళ్లపేటలో జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

**ఆలమూరు:** రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు శివారు జిల్లెళ్లపేటలో మంగళవారం రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, సర్పంచ్ నేలపూడి లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ ఈకార్యక్రమానికి గ్రామస్తులు అపూర్వ సాగతం పలికారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలు అడిగిన సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగారు. అహర్నిశలు ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తీర్చిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

**సురక్షిత తాగునీటి పథకం ప్రారంభం**

జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా సుమారు రూ.16 లక్షలతో నిర్మించిన సురక్షిత తాగునీటి పథకాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. బడుగు బలహీన వర్గాలు, మైనారిటీల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల ద్వారా గ్రామానికి రూ.50 లక్షల వరకూ లబ్ధి చేకూరినట్లు ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఏజీపీ నామాల శ్రీనివాసు, పీఏసీఎస్ చైర్మన్ నల్లి రాజు, సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు, పెంటపాటి శ్యామల, చింతపల్లి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, నల్లా సత్యనారాయణ, చల్లా భూషణం తదితరులు పాల్గొన్నారు.

### జగన్ బాబు దేవుడయ్యా!



**ఆలమూరు:** నెల నెలా ఒకటో తారీఖున తెల్లవారుజామునే ఇంటికి పింఛన్ పంపుతున్న జగన్ బాబు నాపాలిట దేవుడయ్యా.., ఆ పింఛన్‌తోనే సంతోషంగా గడుపుతున్నాను. నా జీవితంలో ఇటువంటి పాలకుడ్ని మునుపెన్నడూ చూడలేదు. రూ.2750 పింఛన్ డబ్బును పెంచి ఇస్తున్న ఆ బాబూ నా ఆయుస్సు పోసుకుని నిండు నూరేళ్లు జీవించాలయ్యా.. అంటూ ఆలమూరు శివారు జిల్లెళ్లపేటలో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో వృద్ధురాలు నాతి కాంతమ్మ ముచ్చటించింది.

## ఏపీపీవీడబ్ల్యూఏ జిల్లా తొలి కార్యవర్గం



నూతన అధ్యక్షుడు సురేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న రాష్ట్ర నాయకులు

**కొత్తపేట:** ఏపీ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీపీవీడబ్ల్యూఏ) జిల్లా తొలి కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేసింది. కొత్తపేటలోని కాపు కల్యాణ మంటపంలో అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు చక్కా రాంబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. నూతన కార్యవర్గంతో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సంఘం జిల్లా తొలి అధ్యక్షుడిగా గెడ్డం సురేష్‌కుమార్ (పలివెల), గౌరవాధ్యక్షుడిగా ఎస్‌కే ఖాజాబాబు (అమలాపురం), ప్రధాన కార్యదర్శిగా సంగుల దొరబాబు (మండపేట), కోశాధికారిగా చోడే గోపీకృష్ణ (అంబాజీపేట), ఉపాధ్యక్షులుగా ఎస్.మనోజ్‌కుమార్ (రావులపాలెం) తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడు సురేష్‌కుమార్‌ను భారీ గజమాల, శాలువాలతో సత్కరించారు. మిగిలిన కార్యవర్గాన్ని పూలమాలలతో అభినందించారు.

### దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

**సఖినేటిపల్లి:** దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి, వారికి సంక్షేమానికి ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు గురించి తగిన కృషి చేయగలమని సెయింట్ మదర్‌థెరిసా దివ్యాంగుల సామాజిక సంస్థ డైరెక్టర్ వి.వరప్రసాదరావు అన్నారు. మంగళవారం శృంగవరప్పాడులో మణికుమారి వృద్ధాశ్రమంలో, ఆశ్రమం డైరెక్టర్ కొల్లాబత్తుల చిరంజీవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో దివ్యాంగుల సమస్యలు, వాటి పరిష్కారం, అలాగే వారి సంక్షేమం గురించి చర్చించారు.

# సమాన పనికి సమాన వేతనం

**సీఎంకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి**



రాజమహేంద్రవరంలో కలుసుకున్న ఔట్‌సోర్సింగ్ జేఏసీ సభ్యులు

**కొత్తపేట:** ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరం విచ్చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన స్పందనలో జేఏసీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. జేఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నక్కా వెంకటరత్నం ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు రాజమహేంద్రవరం మార్కెటింగ్ కమిటీ కార్యాలయంలో కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సీఎంఎఫ్ఎస్ కోడ్‌లో ఉండుట వలన రెగ్యులర్ ఉద్యోగులుగా చూపిస్తున్నారని, దాంతో ప్రభుత్వ పథకాలు ఏమీ తమకు వర్తించడం లేదని వాపోయారు. రెగ్యులర్ ఉద్యోగులు మాదిరిగా తమకూ 62 సంవత్సరాలు రిటైర్మెంట్ వయసు వర్తింపజేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని, ఉద్యోగి సాధారణంగా మరణిస్తే రూ.2 లక్షలు ఇస్తున్నారు. దానిని రూ 5.లక్షలకు, ప్రమాదవశాత్తూ మరణిస్తే ఇస్తున్న రూ.5 లక్షలకు రూ.10 లక్షలకు పెంచాలని, రిటైర్ అయిన తరువాత ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోడానికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపేట ఏఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దామోదర ముత్యాలు, గౌరవాధ్యక్షుడు అడపా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు జె.వెంకటేశ్వరరావు, కుడుపూడి రామానందజోషి, దేశంశెట్టి తరుణ్ తదితరులు పాల్గొన్నారు

# అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



వానపల్లిలో చిన్నారుల నృత్య భంగిమ

**కొత్తపేట:** మండలంలోని వానపల్లి సంతమార్కెట్ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా అలరించింది. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ అన్నందేవుల మాధవరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వివిధ సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దానిలో భాగంగా రాజమహేం ద్రవరం శ్రీవెంకట్రాయ నాట్య బృందం వారు కూచిపూడి నృత్యాన్ని నిర్వహించారు. బృందం గురువు సప్పా యశోదకృష్ణ పర్యవేక్షణలో ప్రధాన నృత్య కళాకారుడు కోలా రాముతో పాటు శిష్య బృందం సభ్యులు కొత్తపేట, వాకాడవారిపాలెం, డేగలవారిపాలెం, కేదార్లంక గ్రామాలకు చెందిన చిన్నారులు వినయ్, లాస్యవీరఅమృతవల్లి, తేజశ్రీ, వేదతీర్థశ్రీ, తనూష, శివానిమహేశ్వరి, వాగ్దేవి, కావ్య, రాజి, తాళలయలకు అనుగుణంగా హావభావాలతో చేసిన నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ప్రదర్శన అనంతరం నృత్యకళాకారుడు కోలా రాము, చిన్నారులను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

## అంతర్వేది ఆలయంలో అధ్యయన ఉత్సవాలు

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో మంగళవారం ఆలయ అర్చకులు స్వామివారి అధ్యయన ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు ఆశీనులు చేసి విశేష పూజలు చేశారు. స్వామివారి చెంతన మరో వేదికపై స్వామి ప్రధాన భక్తులైన వివిధ ఆళ్వార్‌లను ఆశీనులు చేసి ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు తెలిపారు. ఏటా ధనుర్మాసంలో వైష్ణవ ఆలయాల్లో ద్రవిడ ప్రబంధంను స్వామికి చదివి వినిపించే కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ క్రమంలో గ్రంథం వినిపించే ప్రక్రియ అధ్యయన ఉత్సవాల ప్రాధాన్యం అని అర్చకులు తెలిపారు.

## నేటి నుంచి ముంగండలో రుగ్వేద మహాసభలు

**పి.గన్నవరం:** మండలంలోని ముంగండ చింతామణి గణపతి మందిరంలో శ్రీ అశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ ఆధ్వర్యాన బుధవారం రుగ్వేద మహాసభలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 6వ తేదీ వరకూ సంపూర్ణ రుగ్వేద సంహిత పారాయణ, వేద విద్వత్ మహాసభలు ఘనంగా నిర్వహించనున్నట్టు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు గోదావరి వెంకట సుబ్బారావు, చెరుకూరి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ సభలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేద విద్వాంసులు హాజరవుతారన్నారు. వేద రక్షకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పరిషత్ సహ కార్యదర్శి గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి కోరారు.

# కొబ్బరి, కోకోలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



అంబాజీపేటలో కొబ్బరి తోటలో దుక్కు దున్నుతున్న రైతులు

**అంబాజీపేట:** రానున్న వేసవి నేపథ్యంలో కొబ్బరి, కోకో తోటల్లో రైతులు యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. దుక్కులు చేసిన కొబ్బరి తోటల్లో బేసిన్‌లు వేసుకోవాలన్నారు. రెండో విడతగా అరకిలో యూరియా, కిలో సింగ్ సూపర్ ఫాస్పేట్, కేజీ పావు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకొని నీటితడులు పెట్టాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో కనీసం వారానికి ఒక్కసారైనా నీటి తడులు పెట్టుకోవడం వల్ల పిందె రాలుట అరికట్టవచ్చన్నారు. మెరక తోటల్లో, వర్షాభావ పరిస్థితులు లేని తోటలలో ప్రతి 15 రోజులకు నీరు పెట్టాలన్నారు. పచ్చి రొట్టను కోసి కొబ్బరిచెట్టు పళ్లెంలో వేసుకోవాలన్నారు. నీటి లభ్యత తక్కువ ఉన్నచోట డ్రిప్ పద్ధతి ద్వారా నీటిని రోజుకు సుమారు 50 నుండి 60 లీటర్ల ఎరువుల ఆదా కొరకు డ్రిప్ విధానాన్ని అనుసరించాలన్నారు. కొబ్బరిని ఆశించు నల్లముట్టె పురుగు, సర్పిలాకార, బొండార్ గూడు తెల్లదోమ, ఆకుతేలు, గానోడెర్మా తెగులు మరియు నల్లమచ్చ తెగులు ఉనికిని పరిశీలిస్తూ ఉండాలన్నారు. తెగుళ్లు, పురుగులు అధికంగా ఉంటే శాస్త్రవేత్తలను సంప్రదించి యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.